క్లుప్తంగా

క్రీడాకారులను ప్రోత్సహించాలి


బహుమతులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

చొప్పదండి: గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలని సదిశ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ నవీన్‌రెడ్డి, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బందారపు అజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని రెవెల్లి గ్రామంలో యువతకు షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. పద్దెనిమిది జట్లు పాల్గొన్నాయి. క్రీడల నిర్వహణకు సహకరించిన సదిశ ఫౌండేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గజ్జెల ప్రవీణ్, అంజయ్య, లక్ష్మణ్, చంద్రయ్య, అఖిల్ కుమార్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ రిలే నిరాహార దీక్ష


రిలే దీక్షలో కుటుంబ సభ్యులు, మద్దతుదారులు

జమ్మికుంట: భూమి కబ్జాకు గురైందంటూ న్యాయం చేయాలని పట్టణంలోని కాటిపల్లి లక్ష్మి కుటుంబ సభ్యులు సోమవారం రిలేదీక్ష చేపట్టారు. సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ, దళిత నాయకులు మద్దతు పలికారు. కొంతకాలంగా ఓ మాజీ పోలీస్ అధికారి భూ కబ్జాకు పాల్పడుతూ అక్రమ కట్టడం నిర్మించే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. పలుమార్లు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశామని, అధికారుల ప్రోత్సాహంతోనే భూ కబ్జాదారుడు కట్టడానికి పూనుకుంటున్నాడని, విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. రిలే దీక్షలో సంధ్యారాణితోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే తప్పుడు కులగణన సర్వే


మాట్లాడుతున్న నరేందర్‌గౌడ్, నాయకులు

హుజూరాబాద్: రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని, ప్రభుత్వ నివేదిక తప్పుల తడక అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో లబ్ధి కోసం బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని, అస్తవ్యస్తంగా కులగణన సర్వే నిర్వహించిందని, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, లేదంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాటూరి శ్రీనివాస్‌గౌడ్, ఐలయ్యగౌడ్, సదానందం గౌడ్, ఐలయ్య యాదవ్, ప్రవీణ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏగా కొనసాగించాలని ఆందోళన


ధర్నా చేస్తున్న మహిళలు

గన్నేరువరం: గన్నేరువరం హరిప్రియ గ్రామ సమైక్య వీవోఏగా విధులు నిర్వహిస్తున్న మీసం పుష్పలత తొలగింపుపై మహిళా సంఘాల సభ్యులు భగ్గుమన్నారు. ఆమె తొలగింపు కుట్రపూరితంగా జరిగిందని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల సభ్యులు సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్, గ్రామ మహిళా సమాఖ్య భవనాల వద్ద ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా జాబితాలో తనపేరు రాలేదనే ఆవేదనతో ఇటీవల జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పుష్పలత అధికారులతో మాట్లాడిందని, దీన్ని ఇతర దురుద్దేశంతో చూడటం సమంజసం కాదని, హరిప్రియ సంఘం బలోపేతానికి విశేష కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో లబ్ధిదారులుగా చూడాలి కాఈనీ మహిళా సంఘానికి, గ్రామసభకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఏపీఎం లావణ్యను సంప్రదించగా ప్రజాపాలన గ్రామసభలో ఆందోళన చేపట్టిందని, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మహిళ సమాఖ్య సమావేశం నిర్వహించి తీర్మానం చేసి తొలగించామన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

చొప్పదండి: పట్టణంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో సోమవారం వసంత పంచమి పర్వదినం పురస్కరించుకొని ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండే ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు సింహాచలం జగన్ మోహన్ స్వామి, భాష్యం నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పాటిమీద శ్రీఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలోని సరస్వతీమాత ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం కోసం దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేసింది. పెద్ద ఎత్తున భక్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు చదువులో ఉన్నత స్థితికి రావాలని తల్లిదండ్రులు అమ్మవారిని వేడుకున్నారు. పెన్నులు, ప్యాడ్లు ఇతరులకు పంచి పెట్టారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అక్కడక్కడ పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్య క్రమాలు ఆకట్టుకున్నాయి.


హుజూరాబాద్: పాటిమీది సరస్వతి దేవాలయంలో విద్యార్థులతో ప్రత్యేక పూజలు

వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ వనితా క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రంగనాయకుల గుట్ట వద్ద ఉన్న శ్రీ సరస్వతి దేవీ ఆలయంలో పిల్లలకు విద్యాసామగ్రి పంచిపెట్టారు. పలు ప్రైవేటు పాఠశాలల్లో సైతం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.


చొప్పదండి: జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ వద్ద మంచినీటిపైపులైన్ లీకేజీకి అధికారులు సోమవారం మరమ్మతు చేయించారు. ఈ నెల 3న సాక్షిలో ప్రచురితమైన వాట్సాప్ కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

అందుబాటులో ఉంటూ సేవలందించాలి

మానకొండూర్: ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి వైద్య సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించాలని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ తమిళనాడు వైద్యాధికారి డాక్టర్ వి.శరవన్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అన్నారం సబ్ సెంటర్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసరాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బీపీ, డయాబెటిక్, క్యాన్సర్, రోగులకు తప్పనిసరిగా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రులలో వైద్య సిబ్బంది, హాజరు రిజిస్టర్లతో పాటు పలు రికార్డులను పరిశీలించారు.


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డాక్టర్ శరవన్‌కుమార్

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. వైద్యాధికారి, సనాజవేరియా, సల్మాన్, టీ స్వామి, సీహెచ్‌వో రాజునాయక్, సూపర్‌వైజర్ జుబేర్ స్నేహలత ఉన్నారు.

మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీ

హుజూరాబాద్: పట్టణంలోని పలు వైన్‌షాపులను మున్సిపల్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైన్స్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సక్రమంగా లేకపోవడం పట్ల యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు షాపులకు జరిమానా విధించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోతే షాపులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ కే.సమ్మయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆర్.భూపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యం.కిషన్‌రావు, వార్డు అధికారులు ఆర్.బాలగంగాధర్ తిలక్, సంపత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి. వినయ్, శానిటరీ జవాన్లు ఆర్.సుధీర్, ఎ.రమేష్, పి.అనిల్ కుమార్, టి.కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్-జగిత్యాల రహదారిపై రాస్తారోకో


రాస్తారోకో విరమింపజేయిస్తున్న పోలీసులు

రామడుగు: బీరప్ప దేవాలయం వద్ద బోర్‌వెల్ మోటారును ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన కుర్మ కులస్తులు సోమవారం వెదిర గ్రామ పరిధిలోని వివేకానంద చౌరస్తా వద్ద కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎంపీ నిధుల ద్వారా ఏర్పాటు చేసుకున్న బోర్‌వెల్ మోటారును గ్రామానికి చెందిన రైతు ధ్వంసం చేశాడని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై శేఖర్ రాస్తారోకో చేస్తున్న కుర్మ కులస్తులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు.

మట్టి తరలింపు అడ్డగింత

గన్నేరువరం: అక్రమంగా మట్టి తరలిస్తున్నారని మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామస్తులు సోమవారం టిప్పర్‌ను అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. మిడ్‌మానేరు ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ గ్రామాల్లోని ఉపకాల్వల వద్ద మట్టిని నిత్యం అనుమతి లేకుండా తరలిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతోనే మట్టి దందా యథేచ్ఛగా జరుగుతోందన్నారు. ఇకనైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని మోత్కుల గూడెం అంబేడ్కర్ చౌరస్తాలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిరాశే మిగిలిందని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకుల రాజకొముర‌య్య, బిజిగిరి శ్రీకాంత్, యేబూషి అజయ్, రాజ్ కుమార్, శ్రీకర్,అకాష్, అరుణ్, సందీప్, రణదీర్, సంతోష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు వైర్లు చోరీ

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల శివారులో వ్యవసాయమోటారు వైర్లు చోరీకి గురయ్యాయని రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన శేర్ల కోటయ్య అర్కండ్ల వాగు నుంచి వ్యవసాయమోటార్ పంటకు సాగునీరు అందిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున మోటారువైర్లు కనిపించలేదని, మరికొంతమంది రైతుల వైర్లు దొంగలు ఎత్తుకెళ్లారని కోటయ్య కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హుజూరాబాద్: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన చింతరెడ్డి అశోక్‌రెడ్డి(45) మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం సాయంత్రం దూలానికి ఉరేసుకున్నాడు. భార్య పద్మ ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేశామని పట్టణ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి అంకూస్

జమ్మికుంట: రాష్ట్ర జనాభాలో ముస్లింలు 10 శాతం ఉన్నారని, దూదేకులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆల్ బీసీ, మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అంకూస్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సామాజికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం పని చేయని పక్షంలో ఉద్యమిస్తామన్నారు. నాయకులు రియాజ్, ఇలియాజ్, ఖాదర్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

వీణవంక: ఓసీల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్ల కొండాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీగా ఎన్నికై చిల్లర మాటలు మాట్లాడటం సబబు కాదని, ఈడబ్ల్యూఎస్ కోట్లాడి సాధించుకున్నామని, ఇంకోసారి ఈడబ్ల్యూఎస్‌పై మాట్లాడొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు మూల పుల్లారెడ్డి, ఆర్యవైశ్య మండల ఉపాధ్యక్షుడు పల్లెర్ల కిరణ్, పోరెడ్డి తిరుపతిరెడ్డి, గూటం సమ్మిరెడ్డి, కంతాల కొండాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

హుజూరాబాద్: ఎస్సీ వర్గీకరణ అమలుకు 7న నిర్వహించే చలో హైదరాబాద్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణ శివారులోని పలు మిల్లుల్లో పర్యటించారు. కార్మికులతో కలిసి కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళామండలి డివిజన్ ఇన్‌చార్జి తుంగ ఆంజనేయులు, మండల అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్, నాయకులు బొడ్డు సంజీవ్, ఎర్ర రాజ్ కుమార్, మొలుగు శ్రీనివాస్, నాగరాజు, అనిల్, హ మాలీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం


మహేందర్

హుజూరాబాద్: అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర ఎన్నికలు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించగా హుజూరాబాద్‌కు చెందిన యు.మహేందర్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఏ. శ్రవణ్ కుమార్, ఆర్థిక కార్యదర్శిగా ఎస్. రాఘవేంద్రగౌడ్ నియామకమయ్యారు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా పదవి లభించిందని, సమస్యల సాధన కోసం పనిచేస్తానన్నారు.

చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న లింగయ్య, ఆంజనేయులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన మహంకాళి లక్ష్మయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరైంది. సోమవారం మాజీ ఉపసర్పంచ్ గుంటుక లింగయ్య, ఆంజనేయులు చెక్కు అందజేశారు. చెక్కు మంజూరు కృషి చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దేవేందర్ బాగున్నావా..



తిమ్మాపూర్: దేవేందర్‌రెడ్డి బాగున్నావా అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పలకరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డితో కాసేపు ముచ్చటించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

పట్టణ అభివృద్ధికి ముందుకురావాలి

హుజూరాబాద్: ఇటీవల బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్యను పీవీ సేవా సమితి, సిద్ధార్థనగర్‌కాలనీలకు చెందిన నాయకుల సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి భగవద్గీత బహూకరించారు. ఈసందర్భంగా కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ... ప్రభుత్వ యంత్రాంగంతోపాటు స్వచ్ఛంద సంస్థలు పట్టణ అభివృద్ధికి ముందుకురావాలని తద్వారా ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువఅవుతాయన్నారు. కార్యక్రమంలో పీవీ సేవా సమితి అధ్యక్షుడు తూము వెంకట్‌రెడ్డి, సిద్ధార్థనగర్‌కాలనీ అధ్యక్షుడు సాగి వీరభద్రరావు, అలయన్స్ అధ్యక్షుడు, కోశాధికారి బి.మనోజ్, బి.రామలింగ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. మాధవ రావు, పీడీరాజిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు కె.సదానందం, వేల్పుల ప్రభాకర్, కాసర్ల శ్రీహరి ముక్కెర కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌ను సన్మానిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు


గంగాధర: బీరప్ప ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న సంఘం నాయకులు, గ్రామస్తులు

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

వీణవంక: మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో టేకుల మల్లన్న రాతి విగ్రహం స్థానంలో గుడి నిర్మాణానికి సోమవారం అర్చకులు ఫణింద్రశర్మ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గ్రామస్తులు కలిసి విరాళాల సేకరించి నిర్మాణానికి పూనుకున్నారు. శివరాత్రి పర్వదినం రోజున ఏళ్లుగా పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పోతరవేన రవీందర్, మహేందర్, గడల శ్రీనివాస్, మండల కిష్టయ్య ఉన్నారు.

హుజూరాబాద్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో శ్రీవిశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు బాణాల కృష్ణ కుమార్‌భవానీ దంపతుల అధ్యక్షతన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొగరు భిక్షపతి, నాయకులు పెరుమాండ్ల భిక్షపతి, తొగరు శివకృష్ణ, సంఘం సభ్యులు బాణాల పెద్ద చంద్రమౌళి, చిన్న చంద్రమౌళి, ఉమ్మడి రాజయ్య, ఎదులాపురం సదానందం, బాణాల మహేందర్, ప్రభాకర్, ఎగ్గోజు రమేష్, నరసింహాచారి, బాణాల కుమార్, ఎదులాపురం రంజిత్, శ్రీధర్, రాజు, చిన్నకుమార్ తదితరుల పాల్గొన్నారు.


హుజూరాబాద్: భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

గంగాధర: మండలంలోని తాడిజర్రి గ్రామంలో యాదవుల కులదైవం బీరప్ప గుడి నిర్మాణానికి సంఘం నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. పూజా కార్యక్రమంలో సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

కరీంనగర్‌కల్చరల్: ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కల్యాణ మండపం గ్రౌండ్‌ఫ్లోర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయాన్ని సోమవారం ఏసీ ఎస్.సుప్రియ ప్రారంభించారు. 25 ఏళ్ల నుంచి కోర్టు సర్కిల్‌లోని రాజరాజేశ్వరస్వామి కల్యాణ మండపం మొదటి అంతస్తులో కొనసాగుతున్న కార్యాలయాన్ని పరిపాలన సౌలభ్యం కొరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి మేరకు నూతనంగా కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవోలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని హనుమాన్‌నగర్‌లో కాలనీవాసులు సమష్టిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలోని వీధి నంబర్ 1 వాసులంతా కలిసి, తమ ప్రాంత భద్రత నిమిత్తం సీసీ కెమెరాలు అమర్చాలనే ఆలోచన చేశారు. అంతా పూనుకొని సొంతంగా విరాళాల రూపంలో రూ.1లక్ష వసూలు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు.కాలనీ అధ్యక్షుడు రొండ్ల హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదదర్శి బైరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఇనుకొండ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణంపై ఫిర్యాదు

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్‌లోని డీ94 ప్రధాన కాలువపై అక్రమంగా కల్వర్టు నిర్మిస్తున్నారని ఎస్సారెస్పీ డీఈ, ఏఈలకు సోమవారం స్థానిక రైతు ఊరడి శివారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్సారెస్పీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే తన వ్యవసాయ భూమికి ఎదురుగా కాలువపై స్లాబ్ వేస్తున్నారని వివరించారు. కల్వర్టు నిర్మాణపు పనులను వెంటనే నిలిపివేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

పోలీసుల అదుపులో నిందితులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో సంచలనం సృష్టించిన బెజ్జంకి మహేశ్ హత్య కేసులో నిందితులు కరీంనగర్‌రూరల్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ మహిళకు సంబంధించిన వ్యవహారంలో ఆదివారం రాత్రి జరిగిన వివాదంలో బెజ్జంకి మహేశ్‌ను కాల్వ సతీశ్ బీరుసీసాతో గొంతుకోసి చంపడం సంచలనం కలిగించింది. అదేరోజు రాత్రి ప్రధాన నిందితుడైన సతీష్‌తో పాటు సంఘటన స్థలంలో ఉన్న మరో వ్యక్తిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహేశ్‌ను ఎందుకు చంపాల్సి వచ్చింది, హత్య చేసిన తీరును విచారిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా బొమ్మకల్‌లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మహేశ్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పురుమల్ల శ్రీనివాస్‌తో పాటు అంబేడ్కర్ సంఘం నాయకులు గోష్కి శంకర్, గాలిపల్లి కుమార్, జకినపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.